
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

3 జిల్లా వార్తలు

ఆదివారం 2 జూన్ 2024



మూగజీవాల అక్రమ రవాణా చట్టవిరుద్ధం

యాచారం, జూన్1 : మూగజీవాలను అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధం. పాడిపశువులు, మేకలు, గొర్రెలను రవాణా చేస్తే అందుకు తగ్గ ఆధారాలు పోలీసులకు చూపాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాచారం సీఐ శంకర్‌కుమార్ హెచ్చరించారు. ఈనెల 17న బక్రీదు పండగ సందర్భంగా పాడిపశువులు, మేకలు గొర్రెలను అక్రమంగా రవాణా చేయకుండా నిఘా వేశామన్నారు. ఈ మేరకు మాల్‌లో శనివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేశారు. దూడలను రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

విద్యుత్ వెలుగుల్లో రంగారెడ్డి కలెక్టరేట్



అంబరాన్నంటేలా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు

- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం
- కలెక్టరేట్లలో జాతీయ పతాకాలు ఎగుర వేయనున్న కలెక్టర్లు
- అంతకు ముందు అమర వీరుల స్థూపాల వద్ద నివాళులు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆర్భాటం లేకుండా ఉత్సవాలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అంబరాన్నంటేలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల విజయవంతానికి మూడు జిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ల ప్రాంగణాలు, వివిధ కార్యాలయాలు పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిరాడంబరంగా జరగనున్నాయి.

వికారాబాద్/మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలు ముస్తాబయ్యాయి. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్ల పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్లు, చౌరస్తాల్లో విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆవిర్భవ వేడుకలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా పెద్దఎత్తున సాంస్కృతిక ఉత్సవాలు, ధూంధాం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అధికారిక ఉత్సవాలు జరపనున్నారు. ఆదివారం ఉదయం రంగారెడ్డి జిల్లా కలెకరేట్‌లో వద్ద కలెక్టర్ శశాంక ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం కలెక్టర్ తెలంగాణ ఆవిర్భావాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 8.35 గంటలకు ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో నిర్మించిన అమరవీరుల స్థూపం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు, ప్రముఖులు నివాళులర్పిస్తారు. అనంతరం 9గంటలకు కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణతో కలెక్టర్ గౌతమ్ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లోని వేడుకలకు మహేశ్వరం డీసీపీ విచ్చేస్తున్నారు.

తమదైన ముద్ర

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 2024 జూన్ 2వ తేదీ నాటికి పదేళ్లు పూర్తి కానుంది. ఈ ఉత్సవాలు నిర్వహించడంలో తమదైన ముద్ర వేయాలని ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరో వైపు బీఆర్ఎస్ పార్టీ హడావుడి చేస్తున్నాయి. పోటాపోటీగా వేడుకల నిర్వహణకు సిద్ధమయ్యాయి. నేడు జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకునేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలి సారిగా నిర్వహిస్తున్న ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా జరిపేందుకు సిద్ధమైంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఇలా అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో భాగస్వాములు కానున్నారు.



వేడుకలకు సిద్ధం చేసిన బ్యానర్



ఆహూతుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు

తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాల్లో విద్యార్థుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల కుటుంబాలను కలెక్టరు సన్మానిస్తారు.

ప్రజాప్రతినిధుల ప్రసంగాలు లేకుండానే..

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు లేకుండానే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు కొనసాగనున్నాయి. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిరాడంబరంగా జరగనున్నాయి. కలెక్టరేట్ల ఆవరణలో కాకుండా బయట కొనసాగుతున్న వివిధ శాఖల కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ పతాకం ఎగురవేస్తారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న సందర్భంగా గ్రామాల్లో వారే జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ప్రత్యేకాధికారికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు ఉంటే వారి స్థానంలో పంచాయతీ కార్యదర్శులు జాతీయ పతాకం ఎగురవేస్తారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి రోజు సాయంత్రం 6గంటలకు మహేశ్వరంలోని జిల్లేలగూడ చందన చెరువు వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరు కానున్నారు. జూన్ 3వ తేదీన రెండోరోజు ఎక్కడికక్కడే జాతీయ జెండాను, బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించనున్నారు. మండలాలు, మున్సిపల్, కార్పొరేషన్, డివిజన్ల పరిధిలోని ఆసుపత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేయనున్నారు. పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు కలిసికట్టుగా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న శశాంక

- జిల్లా ఎన్నికల అధికారి శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 1 : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి శశాంక తెలిపారు. శనివారం చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లోని కంట్రోల్ రూంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిలతో కలిసి కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత ఏఆర్వోలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఈనెల 4వ తేదీన చేపట్టనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎలాంటి వస్తువులు, మొబైల్‌ఫోన్లు అనిమతి లేదని తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని జూన్ 4న ఉదయం 5.30 గంటలలోగా అబ్జర్వర్ సమక్షంలో ర్యాండమైజేషన్ చేసి టేబుళ్ల వారీగా కేటాయిస్తారని తెలిపారు. ప్రతీ కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో జూన్ 4న ఉదయం స్ట్రాంగ్ రూములను తెరవడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్‌లకు సంబంధించి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన ప్రతీ ఒక్కరు వారి వారి విధులను అంకిత భావంతో నిర్వర్తించాలని సూచించారు. ఈవీఎం ఓట్ల కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, అబ్జర్వర్ సమక్షంలో 5 వీవీ ప్యాట్స్ ర్యాండమ్‌గా ఎంపిక చేసి స్లిప్పులను లెక్కిస్తారని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సిబ్బందిని, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ప్రతీ రౌండ్ పూర్తవగానే ఎంకోర్ యాప్‌లో డాటా నమోదు చేయడం జరుగుతుందని, కౌంటింగ్ కేంద్రం వద్ద అఫీషియల్ కమ్యూనికేషన్ రూమ్, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఆయన వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఆర్వోలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం వస్తుంది.. ప్రణాళిక సిద్ధం చేసుకోండి

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, ఎన్ని కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయో అంచనా వేయాలని ఆదేశించారు. ముంపు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో, రోడ్లపైన వర్షపు నీరు నిల్వకుండా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ముంపు ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలోని నాలాల్లో చెత్త లేకుండా శుభ్రం చేయించాలని అన్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ పనులు జరుగుతుంటే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ అధికారులు సంబంధిత శాఖల వారితో కలిసి సమన్వయంతో పనులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ టీముల్లో ఇరిగేషన్ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

రూ.8.74లక్షల విలువైన

జిలెటిన్ స్టిక్స్ పట్టివేత

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- పరారీలో ప్రధాన వ్యక్తి





స్వాధీనం చేసుకున్న జిలెటిన్ స్టిక్స్, మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్, జూన్ 1: షాద్‌నగర్ శివారులోని ఓ వెంచర్‌లో రూ.8.74లక్షలకు పైగా విలువైన ప్రమాదకర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. షాద్‌నగర్ పరిధి కమ్మదనం శివారులో ఉన్న బృందావనం కాలనీ రియల్ వెంచర్‌లో పేలుడు పదార్థాలున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు శంషాబాద్ ఎస్‌ఓటీ, షాద్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారన్నారు. 'బిల్డింగ్ బ్లాగ్ రియల్ ఎస్టేట్స్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి అక్రమంగా పేలుడు పదార్థాలు వాడేందుకు పేలుడు పదార్థాలను తెప్పించినట్టు చెప్పారు. వాటిని నల్లగొండ జిల్లాకు చెందిన సతీష్ దిగుమతి చేసేవాడని అన్నారు. వారి నుంచి 490జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వాటిని కలిగి ఉన్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కమ్మదనం శివారులో ఉన్న 'బిల్డింగ్ బ్లాగ్'లోని రాళ్లను పగులగొట్టేందుకు ఈ జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ చేశారన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనంకు చెందిన ఉరుసు నర్సింలు (60), అలాగే పట్టణంలోని మాంటీస్సోరి పాఠశాల సమీపంలో నివసించే ఈశ్వర్(45), ఉరుసు రాజు, రమేష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కాగా వెంచర్ యజమాని మధుసూదన్‌రెడ్డి, సతీష్, ఐడియల్ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోర్ మేనేజర్ నరేందర్‌రెడ్డిలు పరారీలో ఉన్నారని తెలిపారు. జిలెటిన్ స్టిక్స్‌తో పాటు కంప్రెషర్ ట్రాక్టర్, నాలుగు ఫోన్లు, ఒక ఫైర్ కట్టర్, ఎలక్ట్రిక్ టెస్టర్, ఇతర సాంకేతిక సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బి ల్డింగ్ బ్లాగ్‌కు చెందిన యజమాని మధుసూదన్‌రెడ్డి అనుమతులు లేకుం డా పేలుడు పదార్థాలను తెప్పించి వాడుతున్నట్లు గుర్తించామన్నారు. యాదాద్రి జిల్లా భువనగిరి ప్రాంతానికి చెందిన ఐడియల్ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ మేనేజర్ నరేందర్‌రెడ్డి వీటి సరఫరాకు బాధ్యుడన్నారు. క్రైమ్ నంబర్ 421-2024 ప్రకారం 4 అండ్ 5 ఆఫ్ ఎక్స్ ప్లోజివ్ యాక్ట్ 1908 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, ఎస్‌ఓటీ సీఐ సంజయ్‌కుమార్, ఎస్సైశరత్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



షాపులో తనిఖీ చేస్తున్న గోపాల్

మోమిన్‌పేట్, జూన్ 1: ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ సూచించారు. శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్‌తో కలిసి ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులు బిల్లులు లేకుండా విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయరాదని తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్ వ్యవసాయ విస్తరణాధికారి పెంటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

» గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్

» గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

» బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

» నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుతాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

» 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక

» రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్థక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న

» ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహ ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

రాజీమార్గమే రాజమార్గం

● జూనియర్ సివిల్ జడ్జి స్వరూప

ఆమనగల్లు, జూన్ 1: రాజీమార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఈ నెల 8న నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా మండలాల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కేసుల్లో ఉన్న కక్షి దారులకు సమాచారం అందించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కక్షిదారులు కేసుల కోసం కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏపీపీ కార్తిక్, సీఐ ప్రమోద్ కుమార్, శివప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎస్సైలు బాల్‌రామ్‌నాయక్, వరప్రసాద్, శ్రీకాంత్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

జీపీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం

● రికార్డుల నిర్వహణ సరిగా లేదు : డీఆర్డీవో

ఇబ్రహీంపట్నం, జూన్ 1: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే నర్సరీల్లో పలు గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేదని, దీనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలతారెడ్డి అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ నివేదికపై శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో జరిగిన ఫోరంలో ఆమె పాల్గొన్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో రూ.4.22 కోట్ల విలువచేసే పనులు జరగ్గా.. ఉపాధి హామీ పథకం కింద 331 పనులకుగాను రూ.2.05 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు ఫోరంలో వివరించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 59 పనులకు గాను రూ.1.58 కోట్లు ఖర్చు చేశామన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 13 పనులు చేపట్టి రూ.58.88 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ ఉపాధి పనుల నిర్వహణలో భాగంగా పని ప్రదేశంలో మస్టర్లు సరిగా నిర్వహించని క్షేత్రస్థాయి అధికారులపై కూడా చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా కొలతలు తీసి ఎంబీలు సరిగా నిర్వహించని సాంకేతిక సహాయకులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన ఏడు రికార్డులు మూడు నెలలకోసారి అప్డేట్ చేసి ఎంత పేమెంట్ జరిగిందో కూలీలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో సుభాషిణి, ఏపీడీ సక్రియానాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి పద్మ, అంబుడ్స్ పర్సన్ సునీత, ఎంపీడీవో క్రాంతికిరణ్, ఏపీవో తిరుపతాచారి, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకన్న, విజిలెన్స్ అధికారి కొండయ్యలు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న శ్రీలతారెడ్డి తదితరులు

10 లోపు యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్‌ను ఈ నెల 10 వరకు పూర్తి చేయాలని మహిళా సంఘాలకు సూచించినట్లు డీఆర్డీవో శ్రీలతారెడ్డి విలేకరుల సమావేశంలో వివరించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య మొత్తం 67,550 మంది కాగా.. వీరిలో బాలికలు 34,930 మంది, బాలురు 32,230 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం 87 కేంద్రాల్లో యూనిఫాం కుట్టు పనులు జరుగుతున్నాయన్నారు. 1,239 మంది మహిళలు యూనిఫాంను కుడుతున్నారని ఆమె వివరించారు.

బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి : డీఎస్వో



తాండూరు రేషన్ డీలర్ల సమావేశంలో పాల్గొన్న డీఎస్వో రాజేశ్వర్

తాండూరు, జూన్ 1: బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, సివిల్ సప్లై వ్యవస్థలో డీలర్ల పాత్ర కీలకమని, ప్రజలకు బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్ అన్నారు. శనివారం తాండూరు సివిల్ సప్లై గోదాంలో డీఎం సుగుణతో కలిసి గోదాంలో గల బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రతీ ఒక్కరు బియ్యం పంపిణీలో సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా షాపుల వద్ద, ఇతర ప్రాంతాల్లో ఎవరైనా బియ్యం కొన్నా.. అమ్మినా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎవరైనా బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు గోదాంలో ఏర్పాటుచేసిన కాంటాలపైనే బియ్యం తీసుకోవాలన్నారు. ప్రతీనెల 1వ తేదీ నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేయాలని, కచ్చితంగా 1వ తేదీనే పంపిణీని ప్రారంభించాలని తెలిపారు. ఈపాస్ మిషన్‌లో ఉన్న బియ్యం నిల్వలు రేషన్ దుకాణంలో ఉన్న నిల్వలు సమానంగా ఉండాలని, వేరియేషన్స్ వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంత్యోదయ కార్డులు కలిగిన డీలర్లు పంచదార డీడీలు కట్టాలని, అంత్యోదయ లబ్ధిదారులకు చక్కెర పంపిణీ చేస్తామన్నారు. ప్రతీనెల రెండు నెలలకు ఒకసారి సివిల్ సప్లై గోదాంలలో సమావేశం నిర్వహిస్తామని, డీలర్ల సమస్యలతో పాటు గోదాంలో నెలకొనే సమస్యలపై రివ్యూ నిర్వహించి పరిష్కరిస్తామని తెలిపారు. బియ్యం అక్రమ రవాణాపై డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎం సుగుణ మాట్లాడుతూ డీలర్లకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామ, కాంటాను లీగల్ మెటరాలజీ అధికారులతో తనిఖీ చేయిస్తామన్నారు. గోదాం ఇన్‌చార్జి రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని డీలర్లకు సకాలంలో బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోదాం ఇన్‌చార్జి రవికుమార్, రేషన్ కార్డు డీలర్ల సంఘం తాండూరు, పట్టణ, యాలాల, బషీరాబాద్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు కూలీల బోనస్ డబ్బుల అవకతవకలపై ఫిర్యాదు

● సీఎం, అటవీశాఖ మంత్రి, పీసీసీఎఫ్, సీసీఎఫ్‌లకు ట్విట్టర్‌లో ఫిర్యాదు చేసిన యువకుడు

ధారూరు, జూన్ 1: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో తునికాకు కూలీల బోనస్ డబ్బులను అధికారులు పక్కదారి పట్టించటం పై సీఎం, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పీసీసీఎఫ్, సీసీఎఫ్‌లకు ధారూరు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యుడు నరేశ్ శనివారం ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లాలోని అన్ని అటవీ రేంజ్‌లలో తునికాకు కూలీలకు మంజూరైన లక్షలాది రూపాయలు బోనస్ డబ్బులు పక్కదారి పట్టాయని ఆయన పేర్కొన్నాడు. బినామీ పేర్లతో కూలీల బోనస్ డబ్బులను అధికారులు మింగేసిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, మే 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'బోనస్ మింగేశారు' అనే కథనం ప్రచురితమవ్వడంతో నరేశ్ దానిని ఫిర్యాదుకు జతచేసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 1: విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీకి చెందిన వెంకట గోపాల శాస్త్రి వాణిజ్యం మరియు వ్యాపార నిర్వహణ(కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్) విభాగంలో 'ఫిజికల్ అండ్ ఫైనాన్షియల్ పర్ఫార్మెన్స్ ఆఫ్ ఎస్‌బీఐ-ఏ సెలెక్ట్ స్టడీ' అనే అంశంపై డాక్టర్ వెంకట జనార్దన్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. అలాగే స్వప్న మెట్టపల్లి జీవ సాంకేతిక శాస్త్ర విభాగంలో 'స్టడీస్ ఆన్ జెనెటిక్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ డిఫెన్స్ జీన్ అగైనెస్ట్ ఫంగస్ పాతోజెన్ ఇన్ గ్రౌండ్ నట్ (ఆరానిస్ హైపోజియా)అనే అంశంపై రాజేందర్ వడ్లూరి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. సాత్వికరెడ్డి వారిని శనివారం ప్రత్యేకంగా అభినందించారు. వీసీ క్రిష్టోఫర్, ప్రొఫెసర్ రవీందర్, జగదీశ్వర్, రాజు, ఇతర అధ్యాపకులు, పీఆర్వో రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.



స్వప్నకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వీసీ క్రిష్టోఫర్

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

యాచారం, జూన్ 1 : తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. శనివారం యాచారం మండలంలోని చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పాఠశాలల పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఉపాధి కూలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలంటే ఏం చేయాలని వారిని ప్రశ్నించారు. పేదలకు నాణ్యమైన విద్య అందాలంటే పాలకులు ఏం చేయాలని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చింతపట్లలో మన ఊరు మనబడి కార్యక్రమంతో పాఠశాలను అభివృద్ధి చేసుకోవడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులను అభినందించారు. దాతలు పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. వేసవిలో ప్రతీ పాఠశాలలో ఉచితంగా తరగతులు నిర్వహించి ఆంగ్లంపై ప్రతీ విద్యార్థి పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. వేసవి శిబిరంతో క్రీడల్లో నైపుణ్యం నేర్పడం అభినందనీయమ, విద్యావంతులు ముందుకు వచ్చి గ్రామస్థాయిలో విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయడానికి ప్రణాళిక రూపొందించాలని అన్నారు. కేవలం విద్యతోనే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని, ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడం పాలకుల బాధ్య అని అన్నారు. తాను చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు వివరించి మీ సమస్యలను తీర్చడం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేపించకుండా ప్రభుత్వానికి వివరించాలని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. పర్యటనలో ప్రొ.లక్ష్మీనారాయణ, ఎన్ఆర్ఐ నిర్మల, ప్రధానోపాధ్యాయుడు జగదీష్, ఉపాధ్యాయులు మల్లేష్, ఎండీ సాబేర్, దాస్, శేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



చింతపట్లలో బాలికతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

పార్కు స్థలాన్ని పరిరక్షించాలి

ఘట్‌కేసర్, జూన్ 1 : మున్సిపాలిటీకి చెందిన 8వేల చదరపు గజాల పార్కు స్థలం పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కౌన్సిలర్ రాజశేఖర్‌తో కలిసి వేంకటేశ్వర లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం వదిలేసిన 8వేల చదరపు గజాల స్థలంనకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో 45ఏళ్ల క్రితం లేఅవుట్ అయిన స్థలానికి ఎలాంటి విచారణ జరుపకుండానే పాసుపుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ అధికారుల తప్పిదమే అవుతుందన్నారు. ఈవిషయమై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే స్థానికులు కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారని వాపోయారు. తాజాగా పార్కు స్థలంలో పనులు చేసేందుకు హిటాచీ వాహనాన్ని తీసుకురావడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రహరీని ధ్వంసంచేసిన కబ్జాదారులపై కేసు నమోదయ్యిందని, తిరిగి హిటాచీ యంత్రాన్ని తీసురావడం సరికాదన్నారు. ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలో ఎలాంటి పనులు జరుగకుండా చూడాలని అధికారులకు వివరించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయడంతోపాటు మున్సిపాలిటీ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, ఈ స్థలం తమదని ఓ ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన బోర్డును తొలగించిన మున్సిపల్ అధికారులు.. ఈ స్థలం మున్సిపాలిటీ స్థలమని నూతన బోర్డును ఏర్పాటు చేశారు.



ధ్వంసమైన పార్కు కంచె శిథిలాలను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

● ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


కొందుర్గు: అంజనేయ స్వామికి సింధూర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు/మాడ్గుల/శంషాబాద్ రూరల్/ఆమనగల్లు/కడ్తాల్/షాద్‌నగర్ అర్బన్/చేవెళ్ల/కొత్తూర్/కేశంపేట,జూన్ 1: హనుమాన్ జయంతిని శనివారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో గల ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొందుర్గులో సమీప పెండ్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం హనుమాన్ విగ్రహానికి సింధూర ఆకుపూజ నిర్వహించారు. రాంచంద్రాపూర్ హనుమాన్ ఆలయంలో అభిషేకం నిర్వహించారు. మాడ్గుల మండలం అందుగులలో ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్‌ఛైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు. మాడ్గులలోని హనుమాన్ ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీవాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నెపాక జంగయ్య, జగన్, లక్ష్మయ్య, దేవయ్య, సురేష్, నిరంజన్, భాస్కర్ పాల్గొన్నారు. శంషాబాద్ మండలం నర్కూడ అమ్మపల్లిలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ అధ్వర్యంలో అభయాంజనేయస్వామికి పుష్పాభిషేకం, పాలాభిషేక పూజలు


కొత్తూర్ హనుమాన్ ఆలయంలో నాయకుల పూజలు


షాద్‌నగర్ అర్బన్: పల్లకీ సేవకు తరలుతున్న భక్తులు

నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్, జూకల్ ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, కుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ సిద్ధులు, గోపాల్, నగేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణం, గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలను తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఆమనగల్లులోని అంగడి బజార్ హనుమాన్ ఆలయం, ఆమనగల్లు సమీప ప్రసన్నాంజనేయాలయంలో అర్చకులు రామకృష్ణశర్మ, నాగఫణిశర్మలు


శంషాబాద్ రూరల్: నర్కూడ అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న బుక్క వేణుగోపాల్ తదితరులు

పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. దుద్దు ఆంజనేయులు, పబ్బు రమేశ్‌గౌడ్, ఉప్పల రాములు, సురేశ్, శ్రీశైలం, రామచంద్రయ్య, కృష్ణ, శ్రీశైలం, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌సింగ్, లక్ష్మణ్, శ్రీధర్, పాండురంగయ్య, దుర్గయ్య, శ్రీశైలం, శివ పాల్గొన్నారు. కడ్తాల, మైసిగండి గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, తులసీరామ్, జవహర్‌లాల్‌నాయక్, రాందాస్, కిషన్, బిచ్యానాయక్, పత్యానాయక్, శేఖర్‌గౌడ్,జి.శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, రామకృష్ణ, మహేశ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కడ్తాల, వివిధ గ్రామల్లో హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చెన్నకేశవ, వీరాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ పాల్గొన్నారు. కడ్తాల భజన మండలి అధ్యక్షులు బాచిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, నరేందర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమాన్ యూత్ సభ్యులు మహేందర్‌రెడ్డి, తరుణ్, యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, సాయి, ఆంజనేయులు, శ్రీరాములు, నారాయణ,శ్రీను, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు. షాద్‌నగర్‌లో హనుమాన్


కడ్తాల్ : మైసిగండిలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

జయంతి ఉత్సవాలను నిర్వహించారు. చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి, ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవంలో పట్టణ ప్రముఖులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేవెళ్ల మండల గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. కొత్తూర్ మున్సిపాలిటీ, గ్రామాల్లో హనుమాన్ జయంతిని జరుపుకున్నారు. తీగాపూర్‌లోని కేశవ చిత్రాలయంలో వ్యవస్థాపకుడు పీజీ కేశవులు ఆధ్వర్యంలో సంజీవ హనుమాన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బి.దేవేందర్‌యాదవ్, సుదర్శన్‌గౌడ్, నాగరాజుచారి, ఇందూరి శ్రీనివాస్, నవీన్‌చారి, గోవింద్‌నాయక్, వీరమోని శ్రీనివాస్, కృష్ణ, శ్రవణ్, నరేష్ చారి, మురళీగౌడ్ పాల్గొన్నారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకులలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కిషన్ ప్రభు ఆశ్రమంలో గీతాపారాయణం, అష్టోత్తరం, విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.


చేవెళ్లలో హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఫ్యూస్‌కాల్ ఆఫీసును ఏర్పాటు చేయండి

● డిప్యూటీ సీఎంను కోరిన ఎమ్మెల్యే


భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 1: షాద్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గంలోని షాద్‌నగర్, కొత్తూర్ మున్సిపాలిటీల్లో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఫ్యూస్ కాల్ ఆఫీసును ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శనివారం సచివాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి 24గంటల విద్యుత్తు సరఫరాకు ఫ్యూస్‌కాల్ కేంద్రం అవసరం అన్నారు. డిప్యూటీ సీఎం స్పందించి ఫ్యూస్‌కాల్ కేంద్రం ఏర్పాటుకు అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతపరుస్తాం

ఆమనగల్లు, జూన్ 1: లయన్స్‌క్లబ్ సేవలను గ్రామాలకు మరింత విస్తృతపరుస్తామని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సండడి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సమావేశం శనివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. సమావేశానికి లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ నరేందర్‌రెడ్డి, జి.చెన్నకిషన్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వి.దామోదర్‌రెడ్డి, జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

అల్లిసాబ్‌గూడలో హనుమాన్ విగ్రహం పునఃప్రతిష్ఠ


విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 1 : షాద్‌నగర్ శివారులోని అల్లిసాబ్‌గూడ గడ్డపై లభించిన హనుమాన్ విగ్రహాన్ని భక్తులు శనివారం పునఃప్రతిష్ఠించి పూజలు చేశారు. షాద్‌నగర్ పట్టణం, లింగారెడ్డిగూడ గ్రామాల మధ్య పూర్వం గుండ్లకుంట గ్రామం ఉండేది. 17వ శాతాబ్దంలో రాజా సవై వెంకట్‌రెడ్డి ఆస్థానంలో ఉన్న గుండ్లకుంట, నిజాం కాలంలో అల్లిసాబ్‌గూడగా మారింది. 5.2ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అల్లిసాబ్‌గూడలో కలరా ప్రబలి మరణాలు సంభవించడంతో గ్రామస్థులు వివిధ గ్రామాలకు వలసపోయారు. అప్పట్లో గుండ్లకుంట వాసులు ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహ స్థలంలో రియల్ వెంచర్ ఏర్పాటుతో విగ్రహం చెట్ల పొదలు, రాళ్ల మధ్యలో ఉండిపోయింది. తాజాగా ఈ విగ్రహాన్ని ఫరూఖ్‌నగర్ యువకులు గుర్తించి, పునఃప్రతిష్ఠించారు. ప్రభుత్వం అల్లిసాబ్‌గూడ గ్రామ కంఠానికి హద్దులను నిర్ధారించి, హనుమాన్ ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

శంకర్‌పల్లి జూన్ 1 : పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి పరిధి పత్తేపురం, రామంతాపూర్ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతులు జూన్ 12లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలమ్మితే జైలుకే


శంషాబాద్ రూరల్: ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న లీనారెడ్డి, ఎస్సై రాంచంద్రయ్య

శంషాబాద్ రూరల్, జూన్ 1 : నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే అలాంటి వారిని జైలుకు పంపిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లీనారెడ్డి హెచ్చరించారు. శనివారం శంషాబాద్, మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏవో కవిత, పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనేప్పుడు రసీదు తీసుకోవాలని సూచించారు.ఎస్సై రాంచంద్రయ్య మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ యజమానులు నకిలీ విత్తనాలమ్మినట్లు తెలిస్తే పోలీసులకు సమాచార మివ్వాలని రైతులను కోరారు. తనిఖీలు కొనసాగుతాయన్నారు.


కడ్తాల్: రికార్డులను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

కడ్తాల్: విత్తనాల, ఎరువుల అమ్మకంపై డీలర్లు విధిగా రశీదులు ఇవ్వాలని ఏవో శ్రీలతకుమారి కోరారు. రావిచెడ్‌లో ఎరువులు, విత్తన దుకాణాలను ఏవో శ్రీలత తనిఖీ చేశారు. ఈ-పాస్‌తోనే ఎరువులు విక్రయించాలని శ్రీలత తెలిపారు. ఏఈవో వందన పాల్గొన్నారు.

ఆమనగల్లు : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఆమనగల్లులో నాగార్జున ఆగ్రో, స్వాతి సీడ్స్, నాగార్జున ఆగ్రో కెమికల్స్, లక్ష్మీవెంకటేశ్వర అగ్రి షాప్‌లను ఎఫ్ఎస్‌పీ మారుతి, ఏవో అరుణకుమారి తనిఖీ చేశారు. దుకాణాల రికార్డులను, విత్తన, ఎరువుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా తనిఖీ బృందం అధికారులు, ఏఈవోలు ఉన్నారు.


షాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో వెంకటేశం

షాబాద్: డీలర్లు నకిలీలు ఫర్టిలైజర్, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాబాద్ ఏవో వెంకటేశంఅన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో డీటీ మధు, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డిలతో తనిఖీలు నిర్వహించారు. ధరల పట్టిక స్టాక్ వివరాలు ఏ రోజుకారోజు రాయాలన్నారు. కొన్న ప్రతీ వస్తువుకు రశీదు ఇవ్వాలన్నారు. విత్తన కొరతరాకుండా తగిన నిల్వలు పెట్టాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరకమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కందుకూర్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కందుకూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలందించాలని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. కందుకూరులో ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. సీఐ మక్బుల్‌జానీ, డీటీ తాజుద్దీన్, ఏవో లావణ్య పాల్గొన్నారు.


ఆమనగల్లు: ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌పీ మారుతి, ఏవో అరుణకుమారి

మాడ్గుల: మండలంలోని వివిధ గ్రామాల్లో నిషేధిత బీటీ3 రకం పత్తి విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బ్రాహ్మణపల్లిలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ, ఎస్ఐ ఉపేందర్, ఏవోలు విత్తనాల షాపులను తనిఖీ చేశారు.

బడిబాటను విజయవంతం చేయాలి


కేశంపేట: మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట, జూన్ 1: ఈ నెల 3 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్‌లో బడిబాట కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు కృషిచేయాలని కోరారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఎస్ఐ లింగం, ఎంపీవో నరసింహ, ఏపీఎం భగవంత్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి:బడిబాటను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రేపటి నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే బడిబాటలో అందరూ పాల్గొనాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గీత ఉన్నారు.

మొయినాబాద్ రూరల్: అన్ని శాఖల సమన్వయంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సంధ్యారాణి అన్నారు. బడిబాట సన్నద్ధత సమావేశాన్ని మండల పరిషత్‌లో నిర్వహించారు. హెచ్ఎంలు, పాఠశాల కమిటీల చైర్‌పర్సన్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 10కల్లా పూర్తిచేయాలన్నారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని పనులు పూర్తి చేయించాలన్నారు. 12న స్కూళ్లలో తల్లిదండ్రులతో సమావేశానికి ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. ఎంఈవో వెంకటయ్య ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ నరసింహారావు, సెక్టోరియల్ ఆఫీసర్ జావెద్ పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



ఆమనగల్లు, జూన్ 1: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులు శనివారం కర్నూల్ జిల్లా శ్రీశైలం భ్రమారంబ మల్లికార్జునస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డిలతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. కసిరెడ్డిని అధికారులు సత్కరించి తీర్థ ప్రసాదాలుఅందజేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నట్లు నారాయణ చెప్పారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రేమ జంట వివాహం

కొందుర్గు, జూన్, 1: రెండేళ్లుగా ప్రేమించుకుంటున్న జంట శనివారం పెద్దల సమక్షంలో పెళ్లిచేసుకున్నారు. శ్రీరంగాపూర్ వాసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పత్తి నరేష్(20) ఇదే గ్రామానికి చెందిన బేబి(19) ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని వారం క్రితం ఇద్దరూ గ్రామం నుంచి వెళ్లిపోయారు. మరుసటి రోజు ప్రేమికులు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. పోలీసుల సూచనతో గ్రామపెద్దలు వచ్చి జంటను తీసుకుపోయారు. గ్రామానికి వెళ్లాక పెళ్లి విషయంలో వెనుకంజ వేయడంతో శనివారం అమ్మాయి బంధువులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మళ్లీ ఇరు వైపుల పెద్దలు వచ్చి మాట్లాడారు. చివరకు శనివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో రెండు కుటుంబాల సమక్షంలో ప్రేమ జంటకు వివాహం జరిపించారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట : అయిళ్ల

కడ్తాల్, జూన్ 1 : రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు పెద్ద పీట వేస్తోందని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండిలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న జూనియర్ ఎంపీఎల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్‌లో మల్లేశ్, మాలిక్‌చంద్ టీంలు తలపడి మొదటి, రెండో బహుమతి గెలుచున్నాయి. మొదటి బహుమతి రూ.20వేలు సభావట్ వినోద్ నాయక్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. క్రీడాకారులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు, స్థానిక నాయకులు హీరాసింగ్‌నాయక్, రాజేశ్‌గౌడ్, కిషన్‌నాయక్, రవి, యాదగిరి, రాము, మల్లేశ్, తులసీరామ్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **షాద్‌నగర్ రూరల్:** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులోని రంగదాములలో వెలిసిన గోదా సమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2న సుప్రభాత సేవ, నిత్యారాధన, హోమం, ఉదయం రంగనాయకస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని ధర్మకర్త పురుషోత్తమాచార్యులు తెలిపారు. ఈ నెల 4 వరకు ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

● **ఆమనగల్లు:** పెద్దూర్ తండాకు చెందిన సభావట్ కిరణ్(22) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుబాన్ని పరామర్శించారు. రూ.3వేల సాయంఅందజేశారు. పరామర్శించిన వారిలో శ్రీను, ఫరీందర్, సురేందర్, చందర్, చందు, బాలు,పాండు, కృష్ణ, రవీందర్, గోపాల్, తదితరులు ఉన్నారు.

● **కేశంపేట:**ఆకస్మికంగా మృతిచెందిన నాగిళ్ల కరుణమ్మ కుటుంబానికి నాయకులు అండగా నిలిచారు. లింగంధనకు చెందిన కరుణమ్మ ఇటీవల మృతిచెందింది. జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి రూ.5వేలు, గ్రామానికి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రూ.5వేలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రూ.11వేలు, సుదర్శన్‌గుప్తా, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి సాయం అందజేశారు.

● **కొత్తూర్:** గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలకు రాజేంద్రప్రసాద్, సురేందర్‌ప్రసాద్ 1.01లక్షల చెక్కును అందజేశారు. దాతలను గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం


లైట్ల వెలుగుల్లో కడ్తాల పోలీస్ స్టేషన్


ముస్తాబైన శంషాబాద్ మండల పరిషత్

ఆమనగల్లు/శంషాబాద్/కందుకూర్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది దినోత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. ఆమనగల్లు,కడ్తాల, మాడ్గుల తలకొండపల్లి మండలాల పంచాతీల్లో ఆదివారం జాతీయ జెండాల ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యాలయాల వద్ద నేడు జాతీయ జెండావిష్కరణ చేయాలని ఎంపీడీవోలు శ్రీకాంత్, సుజ, రాఘవులు తెలిపారు. వేడుకల్లో అందరూ పాల్గొనాలని ఎంపీపీలు అనితవిజయ్, నిర్మలశ్రీశైలం గౌడ్, కమ్లీమోత్యానాయక్, పద్మారెడ్డి కోరారు. శంషాబాద్ మండల పరిషత్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహిస్తామని ఎంపీపీ జయమ్మ తెలిపారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని, ఉదయం 8:45 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.కందుకూరులో నేడు రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహిస్తామని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణానాయక్ తెలిపారు. కాంగ్రెస్ కార్యాలయం ఉదయం 10గంటలకు జాతీయ జెండావిష్కరణ ఉంటుందన్నారు.

క్యాండిల్ ర్యాలీకి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తూర్/ఆమనగల్లు, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గన్‌పార్కు వద్ద శనివారం రాత్రి నిర్వహించిన క్యాండిల్ ర్యాలీకి కొత్తూర్, నందిగామ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్, ఆశోక్, విఠల్‌ముదిరాజ్, గోవింద్‌ఆశోక్, కుమార్, గోవింద్‌రెడ్డి, శ్రీశైలం, శివకుమార్, లక్ష్మయ్య, రవినాయక్, సంపత్ వెళ్లిన వారిలో ఉన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ ఆవరణలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శనివారం బీఆర్ఎస్ నాయకు లు నివాళులర్పించారు. జడ్పీటీసీ అనురాధ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి క్యాండిల్స్‌ను వెలిగించారు. ప్రాణత్యాగం చేసిన అమరుల వల్లనే రాష్ట్రం ఏర్పడిందని అనురాధ పత్యానాయక్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్‌గౌడ్, చలిచీమల సతీష్, భయ్యా దేవేందర్, మడ్డెమోని శివకుమార్, శివ, భీమయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

షాబాద్, జూన్ 1: సీపీఐ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధ కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు నిమగ్నమయ్యారని, ఇప్పుడు ఎన్నికలు ముగిసిపోయాయని, ప్రజా సమస్యలపైన కేంద్రీకరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవ్వాలని, పంచాయతీ లేదా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సీపీఐ పోటీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ, నాయకులు రుక్కయ్య, రాములు, శ్రీశైలం, మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.

అనిరుద్రారెడ్డికి సన్మానం

ఆమనగల్లు, జూన్ 1 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సంఘ సేవకుడు లిక్కి అనిరుద్రారెడ్డిని శనివారం రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సన్మానించారు. మలక్‌పేటలోని ఆర్య వైశ్య సంఘంలో అనిరుద్రారెడ్డిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన సేవలను నాయకులు కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో తన పాలు పంచుకుంటానని అనిరుద్రారెడ్డి అన్నారు. ఏసీపీ రవికుమార్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

చిలుకూరుకు భక్తుల తాకిడి


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

మొయినాబాద్ రూరల్, జూన్1: చిలుకూరు బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తుల తాకిడి పెరిగింది. వేసవి సెలవులతో పాటు వీకెండ్ కావడంతో శనివారం ఆలయానికి భక్తులు ఎండల తీవ్రతను సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. శుక్ర, శని, ఆదివారాల్లో గర్భాలయంలో ప్రదక్షిణలకు అనుమతి లేని విషయం తెలిసిందే. దీంతో భక్తులు ఆలయ వెలుపల నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ల కింద నుంచే మహాప్రదక్షిణలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత కారణంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ నిర్వాహకులు చల్లటి చిరుజల్లులు కురిసేలా ప్రత్యేకమైన ఫ్యాన్లను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల, జూన్ 1: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. శనివారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో ట్రాఫిక్ లోక్‌అదాలత్ నిర్వహించారు. మొత్తం 74 కేసులు పరిష్కరించామని చెప్పారు. రూ.1,77,000 జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

లంకెబిందెలు తీస్తామని రూ.3లక్షలు టోకరా

యాచారం, జూన్ 1: మీ ఇంట్లో లంకెబిందెలున్నాయి. వాటి కారణంగానే మీ ఆరోగ్యం బాగాలేదని దుండగులు ఓ మహిళను నమ్మించి రూ.మూడు లక్షలతో ఉడాయించిన ఉదంతం గున్‌గల్‌లో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం సీఐ శంకర్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గున్‌గల్‌కు చెందిన బందెల రమ్య గత నెల 24న ఆమె కుటుంబీకులతో కలిసి శ్రీశైల పుణ్యక్షేత్రానికి వెళ్లింది. అక్కడ మహేశ్, మల్లికార్జున్, శివశంకర్ అనే ముగ్గురు ఆమెకు పరిచమయ్యారు. వారు రమ్య ఆరోగ్య పరిస్థితి గమనించారు. ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ సమస్యలు తీరుస్తామని నమ్మించారు. గత నెల 27న ఈ ముగ్గురు దుండగులు గున్‌గల్‌కొచ్చి లంకె బిందెల కోసం పూజలు చేయాలని నమ్మించారు. రూ.3లక్షలు ఖర్చవుతాయని చెప్పి వెళ్లారు. గత నెల 30న మళ్లీ వచ్చి రూ.3లక్షలు తీసుకున్నారు. రాత్రివేళ క్షుద్రపూజలు చేసినట్టు నటించి ముందే పాతిపెట్టిన చిన్నపాటి బిందె తీసినట్టు చేసి దాంట్లో దేవుడి విగ్రహం, చిన్నగిన్నెలు ఉంచారు. దుండగులు వెళ్లిన తరువాత బిందెలను చూసి తాను మోసపోయానని రమ్య తెలుసుకుంది. శనివారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారితో సహా మహిళ అదృశ్యం


మేడెల మమత, కూతురు

మాడ్గుల, జూన్1:మండలంలోని నల్లవారిపల్లికి చెందిన మేడల మమత(27) గత నెల 4న ఇద్దరు పిల్లలను వదలి తన వెంట ఒక పాపను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త మేడల దశరథం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భార్య గతంలోనూ ఒకసారి ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి వచ్చిందని, అలాగే వస్తుందని ఎ దురు చూసి రాకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.